రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, మే5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలలో వచ్చిన మార్కులపై రీవెరిఫికేషన్/రీకౌంటింగ్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు. ఫలితాలు వచ్చిన 15 రోజుల్లో ఫీజు చెల్లించాలని, దరఖాస్తుఫారాలు బీఎస్ఈతెలంగాణ.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో కలవని తెలిపారు. ఈనెల 17వరకు దరఖాస్తులు జిల్లాకార్యాలయంలో అందించాలని సూచించారు. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3నుంచి 13వరకు నిర్వహించబడునని తెలిపారు.



● నస్రూల్లబాద్ మండలంలోని ఇటుక బట్టీ

● దోమకొండ మండలంలోని ఇటుక బట్టీ

జోరుగా ఇటుక బట్టీల అక్రమ దందా!

- జిల్లాలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- పైస పన్ను చెల్లించరు.. అధికారులు పట్టించుకోరు
- ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న వ్యాపారులు
- జిల్లాలో సుమారు 300లకు పైగా ఇటుకబట్టీల నిర్వహణ
- ఇందులో ఐదింటికి మాత్రమే అనుమతులు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- ఇటుక బట్టీలపై కొరవడిన సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ

కామారెడ్డి, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమాలకు పుట్టగా ఇటుక బట్టీలు తయారవుతున్నాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం అక్రమార్కులకు వరంగా మారుతోంది. ప్రధానంగా రెవెన్యూ, మైనింగ్ అధి కారులు ఇటుక బట్టీలపై పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ మామూళ్ల మత్తులో కళ్లు మూసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం పలు శాఖల అనుమతులు తీసుకో వాల్సి ఉండగా వ్యాపారులు వాటిని భేఖాతారు చేస్తున్నారు. లాభసాటి వ్యాపారం కావడంతో ఎక్కడపడితే అక్కడ పుట్టగొడుగుల్ల అక్రమంగా ఇటుక బట్టీలను నిర్వహిస్తూ లాభాలను గడిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడు తోంది. జిల్లాలోని పట్టణ ప్రాంతాలోన్లే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు అంతటా వెలుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 300లకు పైగా ఇటుక బట్టీలు ఉండగా కేవలం ఐదింటికి మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలిసింది.

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం

నివాసిత ప్రాంతాలకు 5 కిలోమీటర్ల దూరంలో ఇటుకలు తయారు చేయాలని నిబంధనలు ఉన్నా వాటిని వ్యాపారులు తుంగలో తొక్కుతున్నారు. గ్రామాలలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వహణకు ఆయా పంచాయతీల పరిధిలో రెవెన్యూతో పాటు మైనింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి. దాంతో పాటు జలవనరుల, కాలుష్య నియంత్రణ పరిశ్రమలశాఖల నుంచి అనుమతుల పత్రాలు పొందాలి. ఇవేమీ లేకపోగా ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో బట్టిలను నిర్వహిస్తున్నారు. వాల్టాచట్టాన్ని ఉల్లంఘించి ఎక్కడపడితే అక్కడ గోతులు తవ్వుతూ ఇటుక కోసం మట్టిని తరలిస్తున్నారు. వీటిని పరిశీలించి మండలస్థాయిలో చర్యలు చేపట్టాల్సిన రెవెన్యూ సిబ్బంది పట్టించుకోకపోవడంతో వీరికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇసుక, మొరం తవ్వకాల మాదిరిగా ఇటుకల తయారీకి వినియోగించే మట్టి తవ్వకాలకు వ్యాపారులు ప్రభుత్వ అనుమలు తీసుకోవాలి. ఇవేమీ పట్టించుకోకుంగా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతూ అక్రమంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఇటుక బట్టీల నిర్వహణకు వ్యాపారులు ఆయా ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకోవడం కాదుకదా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి బట్టీలకు తరలిస్తున్నారు. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ చెరువులు, వాగులు ప్రభుత్వ భూముల్లోంచి ఇటుకకు అవసరమైన మట్టిని సేకరిస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టి చెల్లించకపోవడంతో రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు. నిబంధనల ప్రకారం ఒక క్యూబిక్ మీటర్ మట్టిని తవ్వితే రాయాల్టి కింద రూ.42 మైనింగ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఇలా లక్ష ఇటుకలు తయారు చేస్తే రూ.25వేల వరకు మైనింగ్ అధికారుల అనుమతితో ప్రభుత్వానికి డీడీ చెల్లించాలి. కానీ ఇటుక బట్టీల నిర్వాహకులు ఎలాంటి పన్ను చెల్లించకుండా లక్షల్లో దందా కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 300లకు పైగా ఇటుక బట్టిలు ఉండగా ఇందులో కేవలం 5 ఇటుకబట్టిలకు మాత్రమే రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతీఏటా జిల్లావ్యాప్తంగా సుమారు 10లక్షలకు పైగా క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుతున్నారనే అంచనాలు ఉన్నాయి. అంతేకాకుండా అటవీప్రాంతాల నుంచి కట్టెలను సేకరించి ఇటుకలను కాల్చడానికి వినియోగిస్తున్నారు.

ఉచిత విద్యుత్ దుర్వినియోగం

రైతుల సేద్యానికి ప్రభుత్వం బోర్ మోటార్‌లకు ఉచిత విద్యుత్ సరాఫరా చేస్తోంది. వ్యాపారులు ఇటుక తయారీ కేంద్రాల వద్ద బోరు మోటార్‌లు వేసుకుని దానిని ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకుని సర్వీస్ కనెక్షన్ పొందాలి. అందుకు ప్రతీ మూడు నెలలకు రూ.11వేలు విద్యుత్‌శాఖకు చెల్లించాలి. సంబంధిత వ్యాపారులు దానికి విరుద్ధంగా సమీప వ్యవసాయ భూములు, బోరు మోటార్లను లీజ్‌కు తీసుకుని రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. జిల్లాలో పలు ఇటుక బట్టిల వ్యాపారులు ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారు.అంతేకాకుండా ఇటుక బట్టిలను నిర్వహించేందుకు వ్యవసాయ పొలాలను ఏర్పాటు చేస్తే మొదట ఆ భూమిని నాలా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది. కాని ఇవేవి చేయకుండా ఇటుక బట్టిల వ్యాపారం జోరుగా కొనసాగిస్తున్నారు.

మామూళ్ల మత్తులో మైనింగ్, రెవెన్యూ

జిల్లాలో ఆయా గ్రామాలలో ఇటుకబట్టిల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అనే చందంగా మారింది. ఇటుక వ్యాపారం కొనసాగింపునకు స్థానిక రాజకీయ నాయకుల అండను తీసుకుంటున్నారు. దీంతో సంబంధిత శాఖల నుంచి అనుమతులు లేకుండానే ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న 300లకు పైగా ఇటుక బట్టీలు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుని రాయాల్టి పన్ను చెల్లిస్తే ప్రభుత్వానికి సుమారు 25 నుంచి (తరువాయి 8వ పేజీలో..)

ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతం: హౌసింగ్ డీఈ



ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను పరిశీలిస్తున్న డీఈ

నాగిరెడ్డిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ల నిర్మాణాల పనులు వేగంగా చేపడుతున్నామని, నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతున్నట్టు హౌసింగ్ డీఈ సుభాష్ తెలిపారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 11 మండలాలలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ల నిర్మాణం పనులను తాను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. లింగంపేట, బీబీ పేట, దోమకొండ, మాచారెడ్డి మండలలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ల నిర్మాణం పనులు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. గాంధారి, భిక్కనూర్, రామారెడ్డి మండల కేంద్రాలలో రూఫ్ లెవెల్ వరకు పనులు జరిగినట్లు తెలిపారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం బేస్మెంట్ వరకు పూర్తయి, తలుపుల కోసంఫ్రేమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపా రు. నిర్మాణం పనులు వేగవంతంగా జరిపి త్వరగా పూర్తిచేయాలని ఆయన సంబంధిత కాంట్రాక్టర్ రవీందర్ రెడ్డిని ఆదేశించారు. అలాగే కొత్త టెక్నాలజీ ద్వారా మూడు మండలాలలో సదాశివనగర్, గాంధారి, రాజంపేటలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ల నిర్మాణాలు శియర్ వాల్ కొత్త టెక్నాలజీ ద్వారా నిర్మాణాలు జరుపనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ల నిర్మాణాల పనులు వేగవంతంగా జరిగేలా త్వరగా పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి, కాంట్రాక్టర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు భూపతిరెడ్డి

భారత రాజకీయాల్లో అజాతశత్రువు అటల్‌జీ

కామారెడ్డి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): భారత రాజకీయాలలో అజాతశత్రువు అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర నాయకుడు భూపతిరెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో విరాసత్ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులతో సైతం మన్ననలు పొందిన గొప్పనేత అటల్‌జీ అని అన్నారు. దాదాపు 28 రాజకీయ పార్టీలతో పూర్తికాలం సంకీర్ణ ప్రభుత్వం నడిపిన గొప్ప నాయకుడని, జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాల అనుసంధానం చేస్తు ప్రధానమంత్రి సడక్ యోజన, రైల్వేవ్యవస్థ పటిష్టం వంటి సాహసోపేత నిర్ణయాల వల్ల వాటి ఫలితాలు ప్రస్తుత సమాజం పొందుతోందని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉండి ఐక్యరాజ్యసమితిలో భారతదేశం తరఫున అనర్గళంగా మాట్లాడిన గొప్ప నాయకుడని అన్నారు. పాకిస్తాన్‌తో కార్గిల్ యుద్ధం చేసి విజయం సాధించి సరైన గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు. బీజేపీ రెండు సీట్ల నుంచి దేశంలోనే అత్యధిక సీట్లు పొంది 17 రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని సిద్ధాంతపరంగా ఆ మహనీయుడు చూపిన బాటవల్లనే సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్‌మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు మోటూరి శ్రీకాంత్, సంతోష్ రెడ్డి, వేణు, సురేష్, రవీందర్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో కంపించిన భూమి

- భయంతో రోడ్లపైకి పరుగులు తీసిన జనం
- రాత్రంతా రోడ్ల పైనే పడిగాపులు

నిజామాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భూమి ఒక్కసారిగా కంపించింది. జిల్లాలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, సిరికొండ తదితర ప్రాంతాల్లోనూ సాయంత్రం 6:45 గంటలకు రెండు సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ఒక్కసారిగా భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. భూమి కంపించిన సమయంలో భారీ శబ్దాలు వచ్చినట్లు జనం చెబుతున్నారు. అదే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న తమ కుటుంబీకులు, బంధువులకు ఫోన్ చేసి.. క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. మరోవైపు.. రాత్రి వేళ తిరిగి భూమి కంపిస్తుందేమోనన్న భయంతో.. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లలోకి వెళ్లకుండా భయంతో తమ ఇళ్ల ఎదుటే రోడ్లపైనే పడిగాపులు కాయ డం కనిపించింది.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

ప్రజావాణికి 96 ఫిర్యాదులు

కామారెడ్డి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 96 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. భూ సమస్యలు, రెండు పడకగదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్‌ల మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు చేశారని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సాధ్యాసాధ్యాలపై సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని తెలిపారు. కాగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌కు చెందిన వైద్య కిషన్‌రావు గతంలో తాము సాదాబైనామా ద్వారా కొన్న భూములను రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేయకపోవడంతో తమ భూములు అమ్మిన వారి కుటుంబీకులు మళ్లీ ఈ భూములను కొడుకులు, కుటుంబీకుల పేర్ల మీదకు మార్చి అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, ఆర్‌డీవో వీణ పాల్గొన్నారు.



దివ్యాంగుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్

జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుపై కేంద్రానికి నివేదిక

- కేటాయించిన స్థలంలో విద్యుత్ స్తంభాలు, చెరువు, ఇళ్లు
- భూమి కేటాయింపులు పూర్తి చేస్తే ఎయిర్‌పోర్టుకు అవకాశం



ఎయిర్‌పోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిజామాబాద్, మేŚ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించినా ఇప్పటికీ పనులు ముందుకు కదలడం లేదు. ఉమ్మడి రాష్ట్ర హయాంలోనే ఈ ఎయిర్‌పోర్టు కోసం జక్రాన్‌పల్లి వద్ద స్థలాన్ని పరిశీలించినా అప్పటి నుంచి ఇప్పటివరకు అడ్డంకులు తొలగడం లేదు. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పనులు ముందుకు కదలడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం భూములను చూపించినప్పటికీ కొన్ని సమస్యలకు పరిష్కారం చూపకపోవడంతో ఇప్పటి వరకు చర్యలు చేపట్టడం లేదు. గతనెలలో ఎయిర్‌పోర్టు స్థలాన్ని పరిశీలించిన కేంద్ర అధికారులు పలు సూచనలు చేశారు. కేంద్రానికి సమర్పించిన నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆలస్యమవుతున్నట్లు పేర్కొన్నారు. వాటిని క్లియర్ చేస్తే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవకాశం ఉంటుందని వారు కేంద్రానికి ఇచ్చిన నివేదికలో పొందుపర్చారు.

ఉమ్మడి రాష్ట్ర హయాంలోనే నిర్ణయం

జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని ఉమ్మడి రాష్ట్ర హయాంలో నిర్ణయం తీసుకున్నారు. అప్పటి ప్రభుత్వం జక్రాన్‌పల్లి వద్ద భూములను కూడా పరిశీలించింది. జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, కొలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాల పరిధిలో భూములను పరిశీలించింది. అసైన్డ్ భూములతో పాటు పట్టా భూములను సేకరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. తర్వాత ఫీజ్‌బుల్టి విషయంలో 150 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల అడ్డంకులు ఉండటంతో తర్వాత ముందుకు సాగలేదు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జక్రాన్‌పల్లి, ఆదిలాబాద్, బసంత్‌నగర్, వరంగల్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. వరంగల్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణంకు పచ్చజెండా ఊపింది. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని ఎంపీ అర్వింద్ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి చర్యలు తీసుకోవాలని కోరడంతో ప్రత్యేక బృందం గత నెల 23 నుంచి 25 వరకు రాష్ట్రంలో పర్యటించింది. జక్రాన్‌పల్లి ప్రాంతంలోని భూములను కూడా జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. కేంద్ర వైమానిక శాఖకు చెందిన శ్రీనివాస్‌రావు, మల్లికార్జునరాజ్, శైలేష్, దఖానే బృందం ఈ ఎయిర్‌పోర్టుకు అవసరమైన 1600 ఎకరాల భూమిని ఒకేదగ్గర ఉండటంతో పరిశీలించి వెళ్లారు. జిల్లా రెవెన్యూ అధికారులు కూడా వారికి కావాల్సిన నివేదికను అందించారు. ఈ ఎయిర్‌పోర్టుకు సంబంధించి గతంలో ఇచ్చిన నివేదికల ఆధారంగా గత నెలలో పర్యటించిన అధికారులు కూడా తమ నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. వారు ఇచ్చిన నివేదికలో ఎయిర్‌పోర్టుకు సంబంధించిన స్థలంలో కొన్ని నివాస ప్రాంతాలు, విద్యుత్ స్తంభాలు, నీటివనరులు, మసీద్, కొడ శిఖర ప్రాంతం ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని క్లియర్ చేసి ఇవ్వాలని కోరారు. గత కమిటీలో ఇచ్చిన విధంగానే ఈ కమిటీ రిపోర్టులో కూడా పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో భూమిని స్వాధీనం చేసుకొని అందిస్తే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకులు తొలిగే అవకాశం ఉంది.



వివరాలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

ఆంధ్రజ్యోతి

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కోడిచర్లలో మాట్లాడుతున్న కలెక్టర్

మెండోర, మే 4(ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. సోమవారం మండలంలోని చాకిర్యాల్, కోడిచర్ల గ్రామాలలో భూభారతి పైలెట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సులలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..భూసమస్యలను పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో విస్తీర్ణం, హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు నిషేధిత జాబితాలలో ఉన్న భూసమస్యలు, భూరికార్డులలో పేరుతప్పులు, సర్వే నంబర్‌లు పొరపాట్లు, పట్టపాస్ పుస్తకాలు లేకపోవడం, సాదాబైనామ కేసులు ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించడం,హద్దుల నిర్ధారణ, పార్ట్-బీలో చేర్చిన భూసమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి కొత్త ఆర్వోఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్దేశిత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులలో అర్జీలు సమర్పించే అవకాశం లభించనివారు తర్వాత కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన విచారణ కోసం వచ్చే రెవెన్యూ అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. భూసమస్యలు పరిష్కరించుకొని భూవివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను మెండోర మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సావెల్ సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, ఆర్ఐ వేణుగోపాల చారి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పచ్చల నడ్కుడలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

వేల్పూర్, మే5(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీవో సాయిలు పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకోసం దరఖాస్తులు చేస్తున్న వారిలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల నిర్మాణాలకు కావాల్సిన స్థలాలను లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులా కారా అనే అంశంపై సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యదర్శి నవనీత, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏన్నో ఏళ్ల కల... సాకారం దిశగా..

● ఘన్‌పూర్ రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణానికి రైల్వే అధికారుల సర్వే పూర్తి



రైల్వే అండర్ పాస్ నిర్మించే ఘన్‌పూర్ -డిచ్‌పల్లి రోడ్డు ఇదే

డిచ్‌పల్లి,మే 5(ఆంధ్రజ్యోతి):ఘన్‌పూర్ రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణానికి ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆదేశాల మేరకు రైల్వే అధి కారులు సోమవారం సర్వే నిర్వహించారు.రెండు వైపులా ఉన్నగృహయాజమానులకు సర్వేపై అధికారులు నోటీసులు అందజేశారు.త్వరలోనే పనులు ప్రారంభించే ఆవకాశం ఉందని రైల్వేఅధికారులు పేర్కొన్నారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,మే5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామస్థుడైన పోతుగంటి నాగరాజు(40) మద్యం తాగిన మత్తులో రాంపూర్ గ్రామ శివారులోని కుంట నీటిలో తన గ్రామస్థుడైన వాగ్‌మార్ లక్ష్మణ్‌తో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి సోమవారం మృతి చెందాడని రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మృతుడికి ఒక బాబు, ఒక పాపా ఉన్నారన్నారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు ప్రొబేషనల్ మహిళ ఎస్ఐ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

బోధన్‌రూరల్,మే5(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక టిప్పర్లను సోమవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. మండలంలోని సిద్దాపూర్ మంజీర నుంచి ప్రభుత్వ అనుమతితో ఇసుక తరలిస్తున్నారు. కల్దుర్కి మీదుగా ఓవర్ లోడ్, అధిక వేగంతో వెళ్తుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లారీల ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అతివేగంతో వెళ్తున్న లారీ డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైన అధికారులు ఇసుక లారీల, ట్రాక్టర్ల అధిక లోడ్, వాహనాల స్పీడ్ తగ్గించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

రైతులు తమ పేరును విధిగా నమోదు చేయించుకోవాలి

● మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్

ఎడపల్లి,మే5(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని వడ్డాపల్లి గ్రామంలో రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు వివిధ గ్రామాలలో రైతు నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఆయా తేదీల్లో రైతులు తమ పట్టా పాసుబుక్కుతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు లింకు ఉన్న ఫోన్ నంబరు తీసుకుని వచ్చి ఫోటో దిగాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ప్రభుత్వం ఒక ఐడీ కార్డు ఇస్తుందన్నారు. ఈ ఐడీ కార్డు కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎం కిసాన్, ఫసల్ భీమా యోజన, ఇతర కేంద్ర పథకాలకు వర్తిస్తుందని, ప్రతి రైతు విధిగా తమ పేరును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి జ్యోతి, వడ్డాపల్లి గ్రామ కారోబార్ గుణ తేజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా పంట భూములున్న ప్రతీ రైతుకు ఐడీ కార్డులను ప్రభుత్వం అందిస్తుంది ఏవో దేవిక అన్నారు. సోమవారం మండలంలోని పడకల్, జక్రాన్‌పల్లి, అర్గుల్, కలిగోట్ గ్రామాలలో రైతులకు దీనిపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈకార్యక్రమంలోఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రైతులు మతకున్న వ్యవసాయ భూముల సంబంధించిన పూర్తి వివరాలు ఈ ఫార్మరిసిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి రైతువేదికలో స్థానిక రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఈ పార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధదానం చేయబడుతుందని పీఎంకిసాన్, లబ్ధిదారులకు తదుపరివిడత లబ్ధి పొందుటకు ప్రామానికంగా పార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, ఆధార్ లింకు ఉన్న సెల్‌ఫోన్ తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పీఎంకిసాన్ డబ్బులు రావడం జరుగుతుందని ఎంఏవో తెలిపారు.

కల్తీకల్లుపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి):కల్తీకల్లు తీసుకునే వినియోగదారుల ఆరోగ్యంపై దాని ప్రభావం గురించి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కల్తీకల్లుకు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిజామాబాద్ నార్కో అనాలసిస్ డీఎస్పీ సోమనాథం ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈనెల 7న జిల్లాలోని 26 మండలాల్లోని 104 గ్రామాల్లో కల్తీకల్లుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్తీకల్లు విషయంలో నేరస్తులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడంతో పాటు సమస్యకు పరిష్కారం కొరకు ఈ వ్యసనం నుంచి బయటపడటానికి ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అవగాహన కార్యక్రమాలు కల్తీకల్లుపైనే కాకుండా మాదకద్రవ్య వ్యసనం దాని హానికరమైన ప్రభావాల గురించి నిర్వహిస్తామన్నారు. ఈనెల 7న ఒక మండలంలో నాలుగు గ్రామాలలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామాలలో అవగాహన బృందాలు సందర్శించడంతో పాటు పౌరసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశావర్కర్లు, లోకల్ పోలీస్, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమైక్య, మండల సమాఖ్యలు పాల్గొనేలా చూడాలన్నారు. ఎవరైనా కల్తీకల్లు మరియు డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1908కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నిజామాబాద్ ఇంచార్జి ఆర్‌డీవో స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం



నోటీసును అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త ఒక్కరోజు సమ్మెను విజయ వంతం చేద్దామని తెలంగాణ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె కార్మికుల నుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్ర జాకార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ సామాన్య ప్రజల హక్కులపై దాడి చేస్తున్నారని అన్నారు. దేశానికి ఆర్థిక వనరులను సమకూర్చే ప్రభుత్వరంగ సం స్థలను పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్ముతుందని కార్మికవర్గం అనేక పోరాటాలు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 29వ కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లను మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తుందని అన్నారు. కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కులను రద్దు చేసిందని లాకౌట్, లేఅష్, వేతనాల తగ్గింపు, కార్మికుల తొలగింపు, కార్మికుల ఉపాధి, యజమానుల ఇష్టంపై ఆధారపడే దుర్మార్గపు విధానాలను లేబర్ కోడ్‌లో తీసుకొచ్చిందని అన్నారు. బీడీ వెల్ఫేర్ యాక్ట్ రద్దు చేసి కార్మికుల సంక్షేమం కోసం ఒక శాతం సెస్ నిధులు లేకుండా చేసిందని కేంద్రం బీజేపీ ప్రభు త్వం 2023 సవరణ తెచ్చి బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలు పెట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు ఈనెల 20న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త ఒక్కరోజు సమ్మెను విజయవంతం చే యాలని పిలుపునిచ్చారు. అనంతరం బీడీ మానిఫ్యాక్చర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నాయక్వాడి శ్రీనివాస్, సీఐటి జిల్లా కమిటీ సభ్యులు రాములు పాల్గొన్నారు.

● భారతీయ రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి

సుభాష్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రైల్వేస్టేషన్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైల్వే సూపరింటెండెంట్ కిషోర్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేలో కాంట్రాక్టు కార్మికు లకు కనీస వేతనాలు, బోనస్, కార్మి క చట్టాలు అమలు చేయడం లేదన్నారు. సమ స్యల పరిష్కారం కోసం రైల్వే కార్మికులు సమ్మె చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్ 22, సబ్ సెక్షన్ 1 ను అనుసరిస్తూ 2025 మే 20న జరుగుతున్న దేశవ్యాప్తం సార్వత్రిక సమ్మెలో రైల్వేలోని అన్ని విభాగాలలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొంటారన్నారు. . రైల్వే యాజమా న్యం ద్వారా కాంట్రాక్ట్ కార్మికులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయక్వాడి శ్రీనివాస్, కటారి రాములు, అబ్దుల్, రాములు, రఫీక్, విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

● భారతీయ రైల్వేలను ప్రైవేటీకరణ చేయొద్దు

డిచ్‌పల్లి:భారతీయ రైల్వేను ప్రవేటీకరణ చేసి ప్రజలపై భారం మోపవద్దని ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పోరాడుతామని సోమవారం డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ కు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నే సాబ్ మాట్లాడుతూ.. రైల్వేలతో సహా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేట్ కరణ చేయవద్దన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైన్‌రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్:కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో సోమవారం సీపీఎం జెండాను అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి కార్మిక వ్యతిరేక విదానాలను అవలంబిస్తుందని విమర్శించారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచారని వర్కర్స్ సమస్యలపై అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ఏనాడు పట్టించుకొని కేంద్ర ప్రభుత్వం కార్పొ రేట్‌లకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేశారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యుడు కుతాడి ఎల్లయ్య, మోహన్, మహిపాల్, పోశన్న, నర్సయ్య, గంగాధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ జయకుమార్‌కు సోమవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు భూపతి, రాజేశ్వర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ మద్దతు

నిజామాబాద్ కల్చరల్: దేశవ్యాప్తంగా ఈనెల 20న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఒక్కరోజు సార్వత్రిక సమ్మెకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ మద్దతు ఇస్తున్నట్లు టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో టీయుసీఐ, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్ ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వజనిక సమ్మెకు మద్దతుగా జిల్లాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ అడిషనల్ కమిషనర్ దిలీప్ కుమార్‌కు కార్మిక సంఘాల జేఏసీ సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, సంఘ నాయకులు భూపతి, రాజేశ్వర్, కిరణ్, రవికుమార్ పాల్గొన్నారు.

భారీ ఈదురు గాలులకు నేలకొరిగిన వృక్షం

నవీపేట,మే5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోతంగల్ వైపు వెళ్లే రోడ్డుపై సోమవారం రాత్రి భారీ వృక్షం నేలకూలింది. సోమవారం రాత్రి భారీ ఈదురు గాలులు వీయగా స్థానిక భట్టువాలా బాగ్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న కానుగ చెట్టు రోడ్డు మధ్యలో పడిపోవడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే సంబంధిత అధికారులు వృక్షాన్ని తొలగించి రాకపోకలను సుమగం చేయాలని స్థానికులు కోరుతున్నారు. వృక్షం నేలకూలిన సమయంలో రహదారి వెంట ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

10 నుంచి ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరం

బోధన్‌రూరల్,మే5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేది నుండి జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు 10వ తేది నుండి 25వ తేది వరకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రభుత్వ పాఠశాల జేసీ బోధన్ నందు ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేయడం జరుగుతుందని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కరాటే, యోగా, డ్యాన్స్ మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ మొదలైన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి గల 1వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల వరకు ప్రభుత్వ పాఠశాల జేసీలో సంప్రదించాలన్నారు.

● ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

సాలూర మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ సాలూర పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాలూర మండల విద్యాశాఖ అధికారి గోగినేని రాజిమంజూష మాట్లాడుతూ మే 10నుండి 20వ తేది వరకు సమ్మర్‌క్యాంప్ నిర్వహించబడుతుందన్నారు. సాలూర జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు డ్యాన్స్, మ్యూజిక్, యోగా, కరాటే, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. 6వ తరరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న వందమంది వరకు అవకాశం ఇవ్వబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మోర్తాడ్: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైయివేట్ పాఠశా లలో చదువుతున్నటువంటి ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యా ర్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి తమ్మిరెడ్డి తెలిపారు. మోర్తాడ్‌లోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో మ్యూజిక్, డ్యాన్స్, డ్రాయింగ్, యోగ, కరాటే నేర్పిస్తారని తెలిపారు. ప్రతీ ఈవెంట్ గంటసేపు ఉంటుందని ఈనెల 10 నుండి 24 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగు తుందని తెలిపారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తారని తెలి పారు.

కార్మికరాజ్య స్థాపన కోసం కృషి చేయాలి

నిజామాబాద్ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి):వివిధ రంగాల్లో కార్మికులు శ్రమతో దేశ అభివృద్ధిలో తమవంతు కీలకపాత్రను వహిస్తున్నారని భారత దేశంలో కార్మిక రాజ్య స్థాపన కోసం కృషి చేయాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేం ద్రంలోని నీలం రాంచంద్రయ్య భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి తత్వవేత్త సోషలిస్ట్ విప్లవకారుడు కారల్ మార్క్స్ 207వ జయంతిని నిర్వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి సంఘ సభ్యులు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం, ప్రజాసంఘాల నాయకులు శివకుమార్, పాల్గొన్నారు.

వీరాపూర్‌లో మహిళ మృతి



సరస్వతి (ఫైల్)

బీర్కూర్,మే 5(ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామా నికి చెందిన అవుసుల సరస్వతి (62) అనే మహిళ శుక్రవారం ఇంట్లో పూజ గదిలో పూజ చేస్తుండగా దీపం అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సోమవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ సరస్వతి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన అవుసుల శ్రీనివాస్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం లేచి స్నానాలు ఆచరించి, ఇంట్లో పూజ చేసి దీపారాధన చేశాడు. అనంతరం శ్రీనివాస్ భార్య సరస్వతి పూజ గదిలోకి వెళ్లి పూజ చేస్తుండగా పూజ గదిలోని దీపం ఆమె చీరకు అంటుకుంది. ఈ ఘటనలో సరస్వతి శరీరం 50 శాతం మేర కాలిపోయింది. ఆమె భర్త తో పాటు చుట్టుపక్కల వారు మంటలను ఆర్పి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సరస్వతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మైనర్‌లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దు

బోధన్‌రూరల్,మే5(ఆంధ్రజ్యోతి):మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా మైనర్లకు సంబంధించి ఐదుగురిని పట్టుకున్నామని, ఐదుగురు మైనర్‌లతో పాటు తల్లిదండ్రులను బోధన్ సెకండ్ క్లాస్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి తల్లిదండ్రులకు జరిమాన విధించారన్నారు.18సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు ఇస్తే వాహన యాజమానులకు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుణ్యస్నానాలకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

కమ్మర్‌పల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి):మండంలోని హసాకొత్తూర్ గ్రామానికి చెందిన కల్లెడ జమున (50) అనే మహిళ సోమవారం ఇబ్రహింపట్నం మండలం ఎడ్డడి గంగకు పుణ్యస్నానాలనిమిత్తం కుటుంబసభ్యులతో వెళ్లింది. ప్రమాదవశాతు నీటిలో పడి ముక్కుకు బలమైన గాయం కావడంతో నీళ్లల్లో పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇబ్రహంపట్న పోలీసలు శవపంచినామ జరిపి శవాన్ని పోస్టుమార్టం చేయించి స్వగ్రామం హసాకొత్తూర్‌కు శవాన్ని తరలించారు. భర్త నారాయణ ఉపాది నిమిత్తం దుబాయిలో ఉంటాడు భార్యమరణవార్త విని స్వగ్రామానికి బయలుదేరినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.మృతురాలికి భర్త నారాయణ, కూతురునందిత, కొడుకు సాయి నితిన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పిట్లం,మే 5(ఆంధ్రజ్యోతి):పిట్లం-మద్దెల్‌చెరు రహదారిపై సోమవారం రాంపూర్ గ్రామ శివారులో సబ్‌స్టేషన్ సమీపాన బైక్‌పై వస్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగిందని స్థానికులు పోలీసులు సమాచారం అందించారు.విషయం తెలియగానే ఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు నారాయణఖేడ్ మండలం మనూర్ మండల వాసిగా ఉందని, బాన్సువాడ నుంచి బైక్‌పై వస్తుండగా రాంపూర్ గ్రామం వద్ద బైక్‌పై నుండి పడి అక్కడిక్కడె మృతి చెందాడని తెలిపారు.

ఉపాధిహామి కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



రామన్నపేట్‌లో మాట్లాడుతున్న మానాలమోహన్‌రెడ్డి

వేల్పూర్, మే5(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్రకోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో ఉపాధి హామి కూలీలతో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ కూలీలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే విదంగా కృషి చేస్తానన్నారు. గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో లేదో అని నేరుగా కూలీల వద్దకు వెళ్లి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకే చేరే విదంగా కృషి చేస్తున్నారన్నారు. అందులో ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం,రూ.500 సబ్సిడీ సిలెండర్, రైతులకు సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్, అర్హులైన రైతులకు రెండు లక్షల రుణమాఫీ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి పథకం ద్వారా రెండు వందల యూనిట్ల లోపు వాడిన వారికి ఉచిత విద్యుత్, పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, మండల బీసీసెల్ అధ్యక్షుడు రమణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ దామోదర్‌గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ భూమారెడ్డి, నాయకులు ఆత్మరావు, మల్లారెడ్డి, పొన్నాల చిన్నయ్య, మోహన్, నితిష్, సృజ న్, శ్రీను,మహేష్,గణేష్, కిషన్,హరీష్, పార్టీ కార్యకర్తలు తదితరులున్నారు.

ఆర్మూర్‌లో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



పాఠకులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి

ఆర్మూర్‌టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలోని గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి సోమవారం డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. ఇటీవల గ్రంథాలయంలోని పైఅంతస్తు నిర్మాణం పూర్తికావడంతో పాఠకుల సౌకర్యార్థం రీడింగ్ హాల్‌తో పాటు ఐదు కంప్యూటర్‌లు డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారన్నారు. పాఠకుల సౌకర్యార్థం వాటర్‌ఫ్రిజ్, ఏర్‌కూలర్ ఏర్పాటు చేశారు. అనంతరం పాఠకులతో ఆయన మాట్లాడుతూ గ్రూప్ పరీక్షలకు సంబం ధించిన అన్ని పుస్తకాలు సమ కూర్చామని ఇంకా ఏమైనా అవసరం ఉంటే లైబ్రేరియన్ వరలక్ష్మీకి సమా చారం ఇవ్వా లని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ మోత్కూరి లింగాగౌడ్ , వాసు, భూపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలని ఎస్‌సీకి వినతి



ఎస్‌సీకి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మాక్లూర్, మే5(ఆంధ్రజ్యోతి)ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాలకు సంబంధించిన ఎత్తి పోతల పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సోమవారం రైతులు ఎస్‌సీ రామారావుకు వినతి ప్రతం అందజేశారు. ఎత్తిపోతల పనులు 70శాతం పూర్తికాగా మిగతా 25 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయని అట్టి పనులను త్వరతిగతిన పూర్తి చేసి సాగునీరు అందించాలని వారు కోరారు. దీనికి అధికారి స్పందిస్తూ జూలై 15 లోపు పనులను పూర్తిచేసి వర్షాకాల పంటకు సాగునీరు అందిస్తామని అధికారు లు హామీ ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్ర మం లో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, శ్యాంరావ్, ఆశన్న, నవీన్, జనార్ధన్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

మోడల్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

బాల్కొండ, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో 2025-26 ఇంటర్మీడియట్‌కు సంబంధించిన ప్రవేశ ప్రక్రియ ప్రారంభం అయిందని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసా ద్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర ఖాస్తు చేసుకునే విద్యార్థులు టీఎస్ మో డల్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుకు చివరి తేదీ ఈనెల 20 వరకు కొనసాగు తుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్ కోరారు.

మోర్తాడ్‌లోని రైతువేదికలో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మోర్తాడ్,మే 5(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని సోమవారం మండల ఏవో హరీష్ తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, ఆధార్ లింకుఉన్న సెల్‌ఫోన్ తీసుకురావాలని తెలిపారు. ఇట్టి రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పీఎం కిసాన్ డబ్బులు రావడం జరుగుతుందని ఏవో తెలిపారు.

మండల బీజేపీ అధ్యక్షుడిగా ఆరే రవీందర్

భీమ్‌గల్ రూరల్ , మే5(ఆంధ్రజ్యోతి):భారతీయ జనతాపారీట మండల అధ్యక్షుడిగా మెండోర గ్రామానికి చంఎదిన ఆరే రవీందరను నియమిస్తూ అధిష్ఠానం ప్రకటించింది. సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు, జిల్లా అధ్యక్షుడు దినేష్, కులచారి కి. బాలొకండ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోటగిరి,మే5(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఫహీన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. ఫహీన్ తన ఇంటి వైపు నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న అక్రమ్ అనే వ్యక్తి అజాగ్రత్తగా నడిపి ఫహీన్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఫహీన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టీబీ, క్షయ వ్యాధిపై అవగాహన

ఎడపల్లి,మే5(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం టీబీ ముక్త్ గ్రామ పం చాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ, క్షయ వ్యాధిపై మండల వైద్య సిబ్బంది అవగాహన కల్పించి 35 క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న తెమడలను సేకరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ డీ ఎల్పీఓనాగరాజు, పంచాయతీ కార్యదర్శిరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



లింబాద్రి గుట్టపై పూజలు చేస్తున్న సినీ నిర్మాత దిల్‌రాజు దంపతులు

లక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకున్న దిల్‌రాజు

భీమ్‌గల్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని గ్రామాలయంలో కొనసాగుతున్న నింబాద్రి లక్ష్మీనర్సింహస్వామి జయంతి నవరాత్రి ఉత్సవాలకు దర్శకుడు దిల్‌రాజు కుటుంబ సమేతంగా హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నంబి పార్థసారథి ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు ఆలయ విశిష్టతను తెలియజేశారు. అనంతరం శ్రీ లింబాద్రిగుట్టపై గల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం సందర్శించారు. అంతకుముందు దిల్‌రాజ్ కు మండల కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.

రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో

సత్తా చాటిన తొర్లికొండ విద్యార్థులు



సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

జక్రాన్‌పల్లి , మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. జగిత్యాల జిల్లాలో ఈనెల 4వ తేదీ వరకు జరిగిన ఈ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు జీ.వనజ, జీ.వరలక్ష్మీ, ఎల్. అంజలి పాల్గొని జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి బంగారు పథకాలు సాదించడం పట్ల సోమవారం ఎంఈవో శ్రీనివాస్ విద్యార్థులను అభి నందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు గంగా మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుగ్లోత్ సౌమ్యకు సన్మానం



గుగ్లోత్ సౌమ్యను సన్మానిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఫుట్‌బాల్ సమాఖ్య వార్షిక అవార్డు జిల్లాకు చెందిన ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగ్లోత్ సౌమ్యను వరించింది. ప్రతియేటా జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య ఉత్తమ క్రీడాకారులకు అవార్డును ప్రకటించనుంది. గత యేడాది ఐడబ్ల్యుఎల్‌లో ఈస్ట్‌బెంగాల్ జట్టు తరఫున తొమ్మిది గోల్స్ సాధించి టాప్ స్కోరర్‌గా సౌమ్య నిలిచింది. అంతర్జాతీయ పోటీల్లో సైతం భారత్ తరఫున పాల్గొని భారత జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించినందుకుగాను ఈ అవార్డు అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో గుగ్లోత్ సౌమ్యను కేర్‌డిగ్రీకళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ ఘనంగా సన్మానించారు. కోచ్ నాగరాజ్‌ను సైతం సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేర్‌డిగ్రీకళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడాకారిణి గుగ్లోత్ సౌమ్య మా కళాశాల పూర్వవిద్యార్థిని కావడం గర్వంగా ఉందన్నారు. కోచ్ నాగరాజ్ కృషితో సౌమ్య అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుధీర్, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, సౌమ్య తండ్రి గోపి, కొయ్యాడ శంకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మారుతున్న నీటి తొట్టెలు



వృథాగా మారిన నీటి తొట్టె

మహమ్మద్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలం సింగితం గ్రామంలో నీటి తొట్టెలు వృథాగా మారుతున్నాయి. గతంలో పశువుల దాహం తీర్చేందుకు, ప్రజలకు ఇతర అవసరాలకు వీలుగా తొట్టెలను ఏర్పాటు చేశారు. కేవలం తొట్టెలు నిర్మించి వాటిలో నీటిని పట్టకుండా సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని దీంతో పిచ్చిమొక్కలు పేరుకు పోయి ప్రజల పన్నులతో నిర్మించిన తొట్టెలు ఎవరికి ఉపయోగపడకుండా పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి తొట్టెలు అందుబాటులోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాల్చేస్తున్నారు.. కాలుష్యం చేస్తున్నారు

● వరి గడ్డికి నిప్పుపెట్టడంతో ఇబ్బందులు



పొలంలో పొగ కమ్ముకున్న దృశ్యం



రోడ్డుపై పొగకమ్ముకున్న దృశ్యం

సుభాష్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పంటపొలంలో వరికోత అనంతరం వరిగడ్డికి నిప్పుపెట్టడంతో కాలుష్యం వెదజల్లుతోంది. వేల ఎకరాల్లో రైతులు వరిగడ్డికి నిప్పు పెడుతుండడంతో పొగ కమ్ముకుని వాతావరణం దెబ్బతింటుంది. ప్రధాన రహదారుల వెంట ఉన్న పంట పొలాల్లో నిప్పు పెడుతుండడంతో కమ్ముకున్న పొగతో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగతో శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు హరిత హారం కింద పెట్టిన చెట్లు సైతం నిప్పుకు ఆహుతై పోతున్నాయి. సంవత్సరాల తరబడి కాపాడిన చెట్లు అగ్నికి ఆహుతి అవడంతో పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గత కొన్ని సంవత్సరాల నుంచి వరిగడ్డికి నిప్పుపెట్టడం తప్పని చెబుతున్నా రైతులు వినిపించుకోవడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులను మరింత అవగాహన పెంచి వరిగడ్డికి నిప్పుపెట్టడం వల్ల జరిగే పరిణామాలను రైతులకు వివరించాలి. రానున్న రోజుల్లోనైనా నిప్పు పెట్టే పద్ధతిని మార్చి ఇతర మార్గాలవైపు పయనించేలా చూడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

కార్యాలయం ఓ చోట.. పనులు మరో చోట!

● మండల పరిషత్ అధికారుల తీరుతో ప్రజల్లో అసహనం ● పనుల కోసం వస్తున్న ప్రజలకు తప్పని ఎదురుచూపులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



11.30 దాటినా కార్యాలయం తలుపులు తెరవని దృశ్యాలు



మహమ్మద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం

మహమ్మద్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఉదయం 11.30 దాటిన తెర్చుకోవడం లేదు. ప్రతిరోజు కార్యాలయంలో ఎవరు అందుబాటులో ఉండరని ప్రజలు ఆరోపించడంతో ఆంధ్రజ్యోతి సోమవారం పరిశీలన చేపట్టింది. ప్రజలు ఆరోపిస్తున్నట్లుగా 11.30 దాటిన ఏ ఒక్క అధికారి అందుబాటులో లేరు. పలువురు ప్రజలు తమ దరఖాస్తుఫారాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో ఎక్కడ ఇవ్వాలో తెలియక వెనుతిరిగి వెళ్తున్నారు.ఈ విషయంపై ఇంచార్జ్ ఎంపీడీఓ అనితను వివరణ కొరగా తాను నిజంసాగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఉన్నట్లు తెలిపారు.

ఎండలతో జర జాగ్రత్త

● వడదెబ్బ తగిలే అవకాశం
● గర్భిణులు, వృద్ధులు, చిన్న పిల్లలు జాగ్రత్తలు పాటించాలి
● వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సూచనలు



ఎండ వేడిమి నుంచి రక్షణగా రుమాలు ధరించిన వాహనదారులు

మద్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండిపోతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఇంకా ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా మే నెలలో ఎండల తీవ్రత అత్యధికంగానే ఉండటంతో ఈ ఎండలకు వడదెబ్బతో అనారోగ్యం పాలవకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎండలో పని చేసే వారు ఉదయం 10, 11 గంటల లోపు సాయంత్రం నాలుగు గంటల తరువాత పని చేయాలని సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండ వేడి గాలులు వీచినప్పుడు ఎండ దెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని వివరించారు.

● వడదెబ్బ లక్షణాలు

శరీర ఉష్ణోగ్రత పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, చర్మం ఎండిపోవడం, నీరసంగా ఉంటూ తడబడటం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, మూత్రం పసుపు రంగులో ఉండి మంటగా రావడం వడదెబ్బ లక్షణాలు, వడదెబ్బ తగిలితే పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితికి చేరుకునే అవకాశం ఉంది.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వడదెబ్బ తగిలిన వారిని చల్లని నీడ ప్రదేశంలో ఉంచాలి. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు గొడుగు ఉపయోగించాలి. తెల్లని కాటన్ వస్త్రాలు వదులుగా ఉన్నవి ధరించాలి. బటయకు వెళ్లేటప్పుడు నెత్తిన టోపీ, లేదా రుమాలు ధరించాలి. సాధ్యమైనంత వరకు ఎండలో తిరగవద్దు. ఉప్పు కలిపిన మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. కొబ్బరి నీళ్ళు, ఓఆర్ఎస్ ద్రవం తాగడం మంచిది. ఇంటి లోపల ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంటి కిటికీలకు, నీటితో తడిపిన బట్టను కట్టుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా చల్లని గాలి నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



లయన్స్ జనరల్ ఆసుపత్రి కోసం భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని లయన్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న స్థలంలో లయన్స్ జనరల్ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ ప్రతినిధులు కంటి వైద్య సేవలు అందిస్తూ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూ మంచి పేరు సంపాదించాలని అలాగే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని కోరడంతో ఆసుపత్రి కోసం తనవంతు 15లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకరను క్వారీ నిర్వాహకులు ఉచితంగా అందజేయాలన్నారు. మానవత దృక్పదంతో వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రైవేటు ఆసుపతుల్లో 400రూపాయల ఫీజు ఉండగా ఇక్కడ మాత్రం 100రూపాయల తక్కువ ఫీజుతో మెరుగైన వైద్యం అందిస్తారన్నారు. ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో తమతమ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. అత్యవసరం అయితే తప్ప ఎండల్లో తిరగవద్దన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బసవేశ్వర్ రావును అభినందించారు. కంటి వైద్య సేవలతో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలన్న ఆలోచన రావడం అభినందనీయమన్నారు. మంచి ఆలోచనతో అదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన వైద్యం అందించి మరో మారు మంచిపేరు బోధన్‌కు తెచ్చి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ కుమార్, లయన్స్ ప్రతినిధులు లక్ష్మీ, బసవేశ్వర్ రావు, నాగేశ్వర్ రావు, నర్సింహ రెడ్డి, కొడాలి కిషోర్, శ్రీనివాస్, లయన్స్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోటపాటి

రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఆర్మూర్ రూరల్ , మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించుకోవాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆర్ఈఏసీ సభ్యుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. ఆర్మూర్ మండలం పిప్రిలో సోమ వారం కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా రూపొందించబడిన కొత్త రకాలను సాగుచేయాలని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్న సాంకేతిక విషయాలను అవలంబించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి నేలలో కర్బన శాతం పెరుగుతుందని అన్నారు. వరికి ముందు పచ్చి రొట్ట ఎరువులు సాగుచేసి భూమిలో కలియదున్నడం వల్ల పంటలో వేసే యూ రియా శాతాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో హరికృష్ణ, శాస్త్రవేత్తలు బీవీ రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అంజయ్య, డాక్టర్ శ్వేత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



దూపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రెంజల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరితగతిన చేపట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సోమవారం మండలంలోని దూపల్లి గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అన్నారు. పేదోడి కల సహకారమయ్యేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేద వారికి అందించి వారికి న్యాయం చేయాలని సూచించారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు సలామ్, నవీన్ తదితరులున్నారు.

ఫొటో న్యూస్



వాగులో తివాచీలా పరిచిన గుర్రపు డెక్క

పూలాంగ్ వాగులో తివాచీలా పరిచిన గుర్రపు డెక్క

సుభాష్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన వాగైన పూలాంగ్‌వాగులో గుర్రపు డెక్క పేరుకుపోయింది. నగరంలోని సుభజిత్ ఫ్యాక్టరీ వెనకాల ఉన్న పులాంగ్‌కాల్వలో పచ్చటి తివాచీలా గుర్రపు డెక్క పేరుకుపోయింది. ఆర్మూర్ వెళ్లే బ్రిడ్జికి ఇరువైపులా గుర్రపు డెక్క కిలోమీటర్ పొడవున పేరుకుపోయింది. నగరానికి ప్రధాన మురికికాల్వ అయిన పులాంగ్ వాగులో గుర్రపు డెక్క పేరుకుపోయిడంతో నీరు పారడంలేదు. దీంతో నీరంతా ఒక్కచోట చేరి కంపుకొడుతోంది. అటుగా వచ్చే వాహనాలకు దుర్వాసన వెదజల్లడంతో వాహనదారులు ముక్కు మూసుకుంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తిర్మన్‌పల్లి రైల్వేగేట్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణమయ్యేనా..!?

● ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు ● ఎదురుచూస్తున్న ఇందల్వాయి మండల ప్రజలు

జర దేఖో!!



తిర్మన్‌పల్లి రైల్వే గేట్

ఇందల్వాయి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయిలోని తిర్మన్‌పల్లి రైల్వేగేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గత కొన్ని ఏళ్లగా ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పిన నేటికి పనులకు మోక్షం కలగలేదు. ప్రతి అర్ధగంటకు రైల్వేగేటు మూసి వేస్తుండటంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. సిరికొండ, భీంగల్, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇందల్వాయి మీదుగా వెళ్లాల్సిందే. ఇందల్వాయిలో తిర్మన్‌పల్లి వద్ద రైల్వేగేటు ఉంది. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధారణ ప్యాసింజర్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్స్ రైళ్లు ప్రతినిధ్యం తిర్మన్‌పల్లి మీదుగా జిల్లా కేంద్రానికి పోతుంటాయి. ఏ రైలు పోయినా తిర్మన్‌పల్లి రైల్వేగేటు మూసివేయాల్సిందే. ప్రతిరోజు అర్ధగంటకు ఒకసారి ఏదోక రైలు ఇందల్వాయి స్టేషన్ నుండి వెళ్లడంతో ప్రతిసారి గేటు మూసివేయాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకేసమయంలో రెండు రైళ్లు రావడంతో దాదాపు 20 నుంచి 30 నిమిషాలు ఆగవల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్నిసార్లు ఎలక్ట్రిక్ గేటు మొరాయించడంతో గేటు తెరుచుకోవడం ఆలస్యమవుతుంది. దీంతో ప్రయాణికులు రైల్వే సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు కేంద్ర ప్రజాప్రతినిధులు స్పందించి ఇందల్వాయిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికులకు ఇక్కట్లు..

ప్రతీరోజు వివిధ రకాల రైళ్లు ఇందల్వాయి స్టేషన్ నుండి వెళ్తుండటంతో ప్రతిసారి రైల్వేగేటు మూసివేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గేటు వేసిన ప్రతీసారి 10 నుంచి 20 నిమిషాల పాటు ఎర్రటి ఎండలో వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రయాణికులు అంటున్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

ప్రభాకర్, తిర్మన్‌పల్లి గ్రామస్థుడు



రోజుకు వందల వాహనాలు ఇందల్వాయి రైల్వేగేటు మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్తుంటాయి. ప్రతీసారి గేటు పడటంతో ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నాం. ఎండాకాలం ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే అందరి సమస్య తీరుతుంది.

ప్రతిపాదనలు పంపాం: ఎంపీ అర్వింద్

జిల్లాలో ఇందల్వాయి, నవీపేట రైల్వేగేటు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి: కలెక్టర్

కామారెడ్డి టౌన్, మేీ5 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవా రం కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ ఆఫీసర్ల కన్వర్జేన్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూలింగ్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఉల్లాస్, సెర్ప్ ఉద్యోగులు ఒకరికొకరు కోఆర్డినేట్ చేసుకుంటూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఐఈవో సలీం, డీఆర్‌డీఓ పీడీ సురేందర్, డీపీఎం సుధాకర్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూర్ గేట్ వద్ద కారు, ఆటో ఢీ

● పలువురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హుస్సేన్

నాగిరెడ్డిపేట, మేీ5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ గేటు వద్ద హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి కారు, ఆటో ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో, కారులో ప్రయాణిస్తున్నవారు తీవ్రంగా గాయపడ్డారు. నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన మల్లేష్ తన కుమారుడు తిరుపతి, గ్రా మానికి చెందిన కాశీ జగ్జీవన్‌తో కలిసి కారులో నాగిరెడ్డి పేట మండల కేంద్రం గోపాల్‌పేట్ నుంచి జలాల్‌పూర్ గ్రామానికి వెళ్తున్నారు. అలాగే మెదక్ జిల్లా గోమారం గ్రామానికి చెందిన ఎండీ, హుస్సేన్ అతని తల్లి ఖాసింబీ, కూతురు ఫాతిమా ముగ్గురు కలిసి ఆటోలో ఎల్లారెడ్డి వైపు నుంచి మెదక్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో తాండూర్ గేటు వద్ద కారు, ఆటో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎండీ హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఖాసింబీ, ఫాతిమాతోపాటు కారులో ప్రయాణిస్తున్న మల్లేశం, తిరుపతి, కాశీ జగ్జీవ న్‌లు గాయపడ్డారు. ఘటన జరిగిన వెంటనే స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి రైతు బీమా అందించాలి

బీబీపేట, మేీ5 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మాజీ సీఎం కేసీఆర్ తెచ్చిన రైతుబీమాను అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు మరణిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 2 నెలలైనా బీమా డబ్బు అందించలేకపోతుందని విమర్శించారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, మాజీ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ జనార్ధన్, మాజీ పార్టీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

సదాశివనగర్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలని ఏవో ప్రజాపతి తెలిపారు. మండలంలోని పద్మాజీవాడిలో సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయాన్ని ఆధునికరించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కార్యక్రమంలో ప్రతీ రైతుకు ఆధార్‌కార్డు తరహాలో 11 నంబర్లతో రిజిస్ట్రేషన్ ఇస్తారని, అన్ని రైతువేదికలలో ఏఈవోలు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ప్రతిఒక్కరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

ఎల్లారెడ్డి, మేీ5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు వచ్చినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన దేవావత్ భాను చిన్నకుమార్తె నిధారాణి గత నెలలో పదో తరగతి పరీక్షలు రాసి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటోంది. గత నెల 28న కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా ఇంటిబయట ఉన్న కరెంటు లైట్లను వేస్తానని చెప్పి వెళ్లి ఇంట్లోకి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద కూతురు కోసం వెతకగా ఆచూకీ లభించకపోవడంతో తల్లి దేవావత్ భాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులకు తెలిపారు ఎవరికైనా బాలిక ఆచూకీ తెలిస్తే ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ నందు సమాచారం ఇవ్వాలని ఎస్సై మహేష్ తెలిపారు.

మురికి కాలువల నిర్మాణ పనుల ప్రారంభం

ఎల్లారెడ్డి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లిలో సోమవారం మురికి కాలువ నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, నాయకులు నాగం గోపికృష్ణ సీసీ మురికి కాలువల నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

భిక్కనూరు, మే 5(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంతో పాటుగా ఆయా గ్రామాల్లో అకాలవర్షానికి దెబ్బతిన్న ఇళ్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ బాలయ్య మాట్లాడుతూ మండలంలో గత ఆదివారం కురిసిన అకాలవర్షం, ఈదురు గాలులకు దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు ఆయన తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

రామారెడ్డి, మేీ5 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం ఇసన్నపల్లి, మోషంపూర్ గ్రామాల్లోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కామారెడ్డి డీపీఎం రమేష్ బాబు పరిశీలించారు. సోమవారం పరిశీలించారు. రైతులు కేంద్రాల్లో వసతులను, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రామారెడ్డి ఐకెపి ఎపిఎం ప్రసన్నకుమార్, సిసిలు ప్రతాప్, శ్రీనివాస్, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

భూభారతి సర్వేలో పాల్గొన్న సబ్‌కలెక్టర్

లింగంపేట, మేీ5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంబాజీపేటలో జరుగుతున్న భూభారతి సర్వేలో సోమవారం సబ్‌కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో డీటీ భరత్, పంచాయితీ కార్యదర్శి పవన్, మండల యువజన కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రామాకృష్ణాగౌడ్, రైతులు ఉన్నారు.

రామారెడ్డిలో అకాల వర్షం

రామారెడ్డి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో, తండాల్లో సోమవారం అకాల వర్షం కురిసింది. రామారెడ్డి మండల కేంద్రంతోపాటు రెడ్డిపేట్, అన్నారం, ఇసన్నపల్లి, కన్నాపూర్, మద్దికుంట, పోసానిపేట్, గొల్లపల్లి, గిద్ద, ఉప్పల్వాయి తదితర గ్రామాల్లో, తండాల్లో మోస్తారు వర్షం కురిసింది. గాలివాన, ఉరుములకు రైతులు ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



బీర్కూర్‌లో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో



శిక్షణ శిబిరంలో చిన్నారులతో ఉపాధ్యాయ బృందం

పెద్దకొడప్‌గల్‌లో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

పెద్దకొడప్‌గల్, మేీ5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వేసవిశిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈసందర్భంగా మండల విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతు ఈ వేసవి శిక్షణ శిబిరం నేటి నుంచి ప్రారంభమై 15 రోజుల పాటు నిర్వహించబడుతుందని తెలిపారు. 13ఏళ్లలోపు బాలబాలికలకు ఉదయం 8 గంటల నుంచి 11.40 వరకు కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్ యోగా తరగతులపై ఉచితంగా శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాలబాలికలు ఈ శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ కమల, శిక్షకులు శివప్రసాద్, సాయిలు, ఉపాధ్యా యులు కిషోర్ సింగ్, సిఆర్‌పి రాములు ఉన్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీర్కూర్: బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించామని, ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈవో వెంకన్న విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రభుత్వఉన్నత పాఠశాలలో వేసవిశిక్షణ శిబిరాన్ని ఇన్‌చార్జి ఎంఈఓ వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో విద్యార్థులకు అథ్లెటిక్స్, వాలీబాల్, చెస్, డిస్క్ త్రో, తదితర క్రీడా పోటీలతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిబిరం 15రోజులపాటు కొనసాగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు ఈ శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. ఈ వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రాధాకృష్ణ, పీడీ ప్రసాద్, మాజీ ఎంపీపీరఘు, విట్టల్ పాల్గొన్నారు.



రేణుకాదేవి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులకు ముక్కెరను అందజేస్తున్న దృశ్యం

దోమకొండలో ప్రారంభమైన రేణుకాదేవి ఉత్సవాలు

దోమకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని రేణుకాదేవి ఆలయం 20 వార్షికోత్సవం ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలోఉదయం 9.15కు గణపతి పూజ, పుణ్యాహవచనము, అమ్మవారికి అభిషేకం, అలంకరణ, హారతి, మత్ర పుష్పము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. దోమకొండకు చెందిన బొంబోతుల చంద్రకళ, రాజనర్సాగౌడ్ కుటుంబ సభ్యులు నవ్యశ్రీ, అఖిల, రుచితలు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగభూషణంగౌడ్‌కు అమ్మవారికి ముక్కెరను అందజేశారు. కార్యక్రమంలో రవిగౌడ్, యాదగిరిగౌడ్, నర్సాగౌడ్, ప్రసాద్‌గౌడ్, స్వామిగౌడ్, రామాగౌడ్, వెంకట్ గౌడ్, హరి గౌడ్, దేవేందర్ గౌడ్, శ్రావణ్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రథోత్సవం సందర్భంగా సంత స్థలం మార్పు

మద్నూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఏడాదిపాటు గాంధీచౌక్ నుంచి బస్టాండ్ వరకు జరిగే సంతను ఏడాదిలో ఒకరోజు రథంగల్లి ప్రాంతంలో నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారాంతపు సంత నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఈనెల 12, 13వ తేదీల్లో రథోత్సవాన్ని పురస్కరించుకుని సంతకు ఒకరోజు కోసం రథం గల్లిలోకి మార్పు చేశారు. లక్ష్మీనారాయణ మందిరం ఆవరణలో జాతర ఏర్పాటుచేయడం సంత ఆ ప్రాంతానికి తరలించారు. ఈనెల 12, 13వ తేదిలలో లక్ష్మీనారాయణ మందిరానికి సంబంధించిన రథోత్సవం జరగనుంది. ఈ రథాన్ని చూడటానికి చుట్టూ పక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు.

విద్యార్థిని అభినందించిన ప్రభుత్వ సలహాదారుడు



సిమ్రాఫిర్దోస్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు

మాచారెడ్డి, మే 5(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ టాలెంట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సిమ్రా ఫీర్దోస్‌ను ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అభినందించారు. సిమ్రా 565 మార్కులు సాధించి మండలంలోనే సెకండ్ టాపర్‌గా నిలవడం హర్షించదగిన విషయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు గతంలో అంతంత మాత్రంగానే చదువులో చురుకుగా ఉండేవారని ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దీటుగా చదువుతూ మార్కులు సాధిస్తున్నారని అన్నారు. సిమ్రాఫీర్దోస్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ఎస్సై స్రవంతి

దోమకొండ, మేీ5 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్సై స్రవంతి అన్నారు. సోమవారం దోమకొండ మండలకేంద్రంలో వారంతపు సంత సందర్భంగా ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సంతలో పీసీలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఎలాంటి దొంగతనాలు జరుగకుండా పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఓవర్‌స్పీడ్, ట్రిపుల్ రైడింగ్ వెళ్లరాదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీరోజు దోమకొండతో పాటు అన్ని గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్, మండల కేంద్రంలో సబ్‌స్టేషన్, ముత్యంపేట రోడ్డు, సంగమేశ్వర్, చౌరస్తా, సీతారాంపల్లి మండల సరిహద్దు, పాతబస్టాండ్ వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పోలీస్ స్టేషన్‌లో వాహనాలు, వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో ఎవరైన పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై జానీపాషా, పీసీలు రమేష్, చంద్రకాంత్, సాయిబాబా, స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడిపై కేసు

ఎల్లారెడ్డి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సాలె సాయిలు తన ఆటోలో ఈనెల 4న తన కుటుంబ సభ్యులతో కలిసి తన ఆటోలో బాన్సువాడ వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో తిమ్మరెడ్డి గ్రామశివారులో విక్రమ్ అనే వ్యక్తి ఆటోను ఢీకొట్టాడని ఎస్సై తెలిపారు. సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గస్తీ దళాలతో దొంగతనాలను అడ్డుకోవచ్చు



గస్తీ దళాల నిర్వహణపై గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై

పెద్దకొడప్‌గల్, మేీ5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో గస్తీ దళాల ఏర్పాటుతో దొంగతనాల అడ్డుకోవచ్చని ఎస్సై మహేందర్ గ్రామస్థులకు సూచించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి, పోచారం గ్రామాలలో సమావేశాలు నిర్వహించి గస్తీ దళాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం అయినందున దొంగతనాలు జరిగేందుకు అవకాశం ఉంటుందని యువకులతో గస్తీ దళాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే దొంగతనాలను అడ్డుకోవచ్చని తెలిపారు. గస్తీదళాలకు సంబంధించి గ్రామాల వారీగా గ్రూపులు ఏర్పాటుచేసి ప్రతి నిత్యం పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. దీంతోపాటు ప్రజలు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మడళేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కామారెడ్డి టౌన్, మేీ5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు సమీపంలోని రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీ మడళేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠాపనను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రజకకులానికి చెందిన మహిళలు ప్రతీ ఇంటి నుంచి బోనం తీసుకుని గాంధీ గంజ్ నుంచి ఆలయం వరకు శోభాయాత్రగా వచ్చిన బోనం సమర్పించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మడళేశ్వరస్వామి దేవాలయానికి రెండు స్లాబులు వేయించిన సందర్భంగా, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డిలు ఈదమ్మ దేవాల యం నిర్మాణం చేయించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని రజక సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు మహేష్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తాడ్వాయి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేసినట్లు పశు వైద్య అధికారి రమేష్ తెలిపారు. గ్రామంలో మొత్తం 456 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు ఖచ్చితంగా వేయించుకోవాలని తెలిపా రు. అనంతరం కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ నాన్‌గెజి టెడ్ వెటర్నరీ ఉద్యోగులు సోమవారం నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమాచారిని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వెంకట్ యాదవ్‌అసభ్య పదజాలంతో అతన్ని, వారి కుటుంబ సభ్యులను టీఎన్ జీవీఏ సంఘాన్ని దూసించడంపై అన్ని జిల్లాలలోనూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షుడు గురుడు నారాయణ రెడ్డి, వైద్యఅధికారులు కొండల్‌రెడ్డి, ప్రేమ్‌సింగ్, మహిపాల్ రెడ్డి, ఎల్లయ్య, బాలచందర్, కిష్టయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

జోరుగా ఇటుక బట్టీల అక్రమ దందా!

(5వ పేజీ తరువాయి)

30 కోట్ల వరకు ఆదాయం సమకురే అవకాశం ఉంటుంది. కాని ఇటుక బట్టీలను అక్రమంగా నిర్వహిస్తున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఇటుక బట్టీల నిర్వాహకుల నుంచి పన్ను వసూళ్లు చేయాల్సిన బాధ్యత మైనింగ్, రెవెన్యూ అధికారులదే. కానీ ఆ శాఖ అధికారులు మాముళ్లు తీసుకుంటూ ఇటుక బట్టీలవైపు కన్నెతి కూడా చూడడం లేదు. ఈ రెండు శాఖలే కాకుండా పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, పంచాయతీ శాఖలు సైతం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇటుక బట్టీల అక్రమ నిర్వహణపై చర్యలు తీసుకోలేకపోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి అక్రమ ఇటుకబట్టీ వ్యాపారులపై కొరడా జులుపించి ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వీసీలో పాల్గొన్న మండల అధికారులు

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు

జుక్కల్, మేీ5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపడుతామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలాధికారులు పాల్గొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నామని, తాగునీటి ఎద్దడి నివారించుటకు తగు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి మండల అధికారులు జిల్లా అధికారులకు తెలిపే బాధ్యత మండల అధికారులపై ఉందని అధికారులు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల వివిధ పథకాలపై జిల్లా అధి కారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమవేశంలో మండల ఆర్‌ఐ రామారావు మండల వ్యవసాయ అధికారి మహేశ్వరి పాల్గొన్నారు.

'దళిత యువకుడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

కామారెడ్డిటౌన్, మేీ5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటజిల్లా చేర్యాల మండలంలోని వేచరణి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమయ్య మాదిగ డిమాండ్ చేశారు. గ్రామంలోని బేడ బుడగ జంగం కులానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు అజయ్ కుమార్ ఆంజనేయస్వామి గుడిలోకి ప్రవేశించాడనే కారణంతో కొందరు వ్యక్తులు సభ్యసమాజం తలదించుకునేలా కాళ్లు, చేతులు కట్టేసి బట్టలు ఊడదీసి నగ్నంగా ఊరేగిస్తూ దాడి చేయడం అమానుషమని అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదవరావు, మారుతి, రవీందర్, మైపాల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భిక్కనూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత చేవెళ్ల పథకానికి నిధులు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సోమవారం మార్కెట్ కమిటీ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని తిప్పపూర్ గ్రామానికి చెందిన నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణహిత చేవెళ్ల పథకానికి రూ.23 కోట్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్, ఏఎంసీ చైర్మన్‌రాజు, వైస్ చైర్మన్ స్వామి,నాయకులు లింబాద్రి, శ్రీరాం వెంకటేష్, భూమయ్య, నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ స్వామి, ధర్మయ్య పాల్గొన్నారు.

బాలుడిని విక్రయించిన కేసులో ఐదుగురిపై కేసు

లింగంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలుడిని రూ.లక్షకు విక్రయించిన కేసులో ఐదుగురిపై కేసునమోదు చేసినట్లు ప్రొబేషనరి ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన బూస లావణ్యకు గత ఐదేళ్ల క్రితం నర్సింలు అనే వ్యక్తితో వివాహం కాగా వారికి బాబు, పాప పుట్టారు. కొద్దిరోజులకు నర్సింలు మృతిచెందగా లావణ్య కొంత కాలం నర్సుగా తర్వాత జిల్లాకేంద్రంలోని ఓ బట్టల దుకాణంలో పనిచేసింది. అదే బట్టల దుకాణంలో పనిచేసే లింగంపేట మండలం పర్మల్ల గ్రామానికి చెందిన చాకలి సాయిలుతో లావణ్యకు పరిచయం ఏర్పడింది. అప్పటికే సాయిలు భార్య గొడవపడి ఇంట్లోనుంచి వెళ్లిపోగా ఒంటరిగా ఉన్న సాయిలు లావణ్యతో వివాహేతర కొనసాగించాడు. కొంతకాలానికి వారిద్దరు వివాహం చేసుకున్నారు. లావణ్యకు మొదటి భర్త నర్సింలుతో పుట్టిన బాలున్ని విక్రయిస్తే డబ్బులు వస్తాయని, దానితో ఆటో కొని జీవనం సాగిద్దామని లావణ్యకు చెప్పాడు. దీంతో లావణ్య కన్న కొడుకును అమ్మేందుకు సిద్ధపడింది. లావణ్య, సాయిలు ఇద్దరు కలిసి లావణ్య తన ఐదేళ్ల కుమారుడిని జనవరి 12న పర్మల్ల గ్రామానికి చెందిన నసీమాకు రూ.50వేలకు విక్రయించారు. బాబును కొనుగోలు చేసిన నసీమా బాబును కొడిపల్లి మండలం రాజీపేటలోని తన సోదరి షాహీదాకు రూ.50వేలకు విక్రయించినట్లు ఎస్సై తెలిపారు. షాహీదా తిరిగి బాబును రూ. లక్షకు కుంచల శేఖర్‌కు విక్రయించినట్లు వివరించారు. బాబును విక్రయించన కొంతకాలానికి సాయిలు మొదటి భార్య తిరిగిరావడంతో లావణ్యకు సాయిలుకు గొడవ జరిగింది. దీంతో విక్రయించిన తన కుమారున్ని తీసుకురావాలని సాయిలుతో లావణ్య గొడవ పడి విషయం చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు తెలియగా వారు బాబును విక్రయించిన ఐదుగురిపై ఫిర్యాదు చేయగా పోలీసులు బాబును తీసుకువచ్చి చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - తుడరాం
ప్రియా 70 - రెట్రో
ప్రియా 35 - రైడ్-2

బాన్సువాడ

మహేశ్వరి - అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
వెంకటేశ్వర - సోదర



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	140	170
వెన్‌కాబ్(కిలో)	130	160	190

